నిర్వాసితుల సమస్యలు గాలికి

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం
- అధికారుల బదిలీలతో పెండింగ్‌లో సమస్యలు

వేములవాడఅర్బన్‌: మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలు ఏర్పాటు చేసినా, ఆ కాలనీల్లో నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. జలయజ్ఞంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ–చీర్లవంచ గ్రామాల మధ్య 2006లో మిడ్‌మానేరు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి, శాభాష్‌పల్లి, చీర్లవంచ, చింతాల్‌ఠాణా, గుర్రవాణిపల్లి, అనుపురం, కొడుముంజ, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌ 2008లో గెజిట్‌ ప్రకారం 11,861 కుటుంబాలు ముంపునకు గురయ్యాయి. వారికి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలు ఏర్పాటు చేసి ప్లాట్‌లను కేటాయించి నిర్వాసితులకు అందించడంతో నిర్వాసితులు కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. వేములవాడ మండలం నాంపెల్లి శివారులో 9 గ్రామాలు, బోయినపల్లి మండలం కుదురుపాకలో 3 గ్రామాల ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలు ఏర్పాటు చేశారు.


రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ

నెరవేరని హామీలు

ఉన్న ఊరు, ఇళ్లు, పంట భూములు సర్వం వదిలేసి పొట్ట చేతపట్టుకుని ముంపు గ్రామాల ప్రజలు ఆర్‌ అండ్‌ఆర్‌ కాలనీలకు తరలివెళ్లారు. కాని ప్రభుత్వం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించకపోవడంతో నిర్వాసితులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. కనీసం యువతకు ఉపాధి లేక ఇంటి వద్దనే ఉండడంతో పూటగడవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఇళ్లు, భూముల పరిహారం, యువతకు ప్యాకేజీ, ఇళ్ల పట్టాలు రాక నిర్వాసితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

అధికారుల బదిలీలతో సమస్యలు పెండింగ్‌

సెప్టెంబర్‌ 2022లో అడిషనల్‌ కలెక్టర్‌, ఆర్డీవో, తహసీల్దార్‌ కలిసి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి నిర్వాసితుల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కాని అవి నేటికి పరిష్కారానికి నోచుకోలేదు. జూలై 2023లో రుద్రవరం ఒక్క గ్రామంలో మాత్రమే అధికారులు గతంలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించినా, వాటిని పరిష్కరించలేదు. అప్పటి సిరిసిల్ల ఆర్డీవోతో పాటు వేములవాడ తహసీల్దార్‌ కూడా బదిలీపై వెళ్లడంతో సమస్య మొదటికి వచ్చింది. ప్రస్తుతం ఉన్న అధికారులకు సమస్య కొత్తగా మారిందని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పరిహారం అందించాలి


మిడ్‌ మానేరు ముంపునకు గురైన సంకెపల్లి పాత గ్రామంలోని మిగిలిన 44 ఇళ్లకు ఇప్పటికీ పరిహారం అందించలేదు. అధికారులు పట్టించుకుని ఇళ్ల నష్టపరిహారం వెంటనే అందించాలని కోరుతున్నాం. – పండుగ సుమన్‌. సంకెపల్లి నిర్వాసితుడు

ఉపాధి కల్పించాలి


మిడ్‌ మానేరు ముంపు గ్రామాల్లోని నిర్వాసిత యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి. ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఇండస్ట్రియల్‌ కారిడార్‌ ఏర్పాటు చేస్తే నిర్వాసితుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. – మధు. రుద్రవరం. నిర్వాసితుడు

సమస్యలు పరిష్కరించాలి


సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు బదిలీపై వెళ్లారు. కనీసం ఇప్పుడున్న అధికారులు వాటిని పరిశీలించి, పరిష్కారించాలని కోరుతున్నాం. – వంకాయల భూమయ్య. రుద్రవరం. నిర్వాసితుడు

క్లుప్తంగా

వాటర్‌ప్లాంట్‌ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్‌-దీప

కోనరావుపేట: మండలంలోని అజ్మీరాతండాలో ప్రతిమ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఫౌండేషన్‌ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు–డాక్టర్‌ దీప బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో స్వచ్ఛమైన నీరు లభించక అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకే గ్రామాల్లో ప్యూరిఫైడ్‌ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఇస్లావత్‌ దివ్య, ఎంపీటీసీ రేణుక, సింగిల్‌విండో డైరెక్టర్‌ గొట్టె మహేశ్వరి, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు ఒగ్గు ప్రభాకర్‌, శ్రీనివాస్‌, ఇన్‌చార్జులు కౌశిక్‌, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్‌ వేణు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీ వైస్‌చైర్మన్‌ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతల రోడ్డును బాగు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చి, వెంటనే పనులు ప్రారంభించేలా ఆదేశించారన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సర్పంచ్‌ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నర్సయ్యయాదవ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రొండ్ల తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, ఉపసర్పంచ్‌ సాదుల్‌, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న చైర్మన్‌ బండి దేవదాస్‌

తంగళ్లపల్లి: కలిసికట్టుగా శ్రమించి సహకార సంఘం అభివృద్ధికి కృషిచేయాలని సిరిసిల్ల సింగిల్‌విండ్‌ చైర్మన్‌ బండి దేవదాస్‌ అన్నారు. బుధవారం నిర్వహించిన సింగిల్‌విండ్‌ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతన్నలకు మేలు చేసేందుకు సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ బాటలో పయణిస్తూ సేవలందిస్తామన్నారు. రుణాల మంజూరు, రికవరీతోపాటు సొసైటీ ద్వారా అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ పడిగెల మానస, వైస్‌చైర్మన్‌ వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు, సర్పంచులు, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రాజన్న, రైతులు పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్‌ పార్టీ మండల నూతన అధ్యక్షులు

వేములవాడరూరల్‌/వేములవాడఅర్బన్‌: కాంగ్రెస్‌ పార్టీ వేములవాడ రూరల్‌ అధ్యక్షుడి వకుశాభరణం శ్రీనివాస్‌, వేములవాడ అర్బన్‌ అధ్యక్షుడిగా పిల్లి కనుకయ్య, వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఓబీసీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేశం

ముస్తాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ ఓబీసీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడిగా ముస్తాబాద్‌కు చెందిన సీనియర్‌ నాయకుడు అగుళ్ల రాజేశంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్‌ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు

రెడ్డి సంఘం కార్యవర్గం

ముస్తాబాద్‌: మండలంలోని మొర్రాయిపల్లె గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా బద్దిపడిగె సతీశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లారపు రమేశ్‌రెడ్డి, కార్యదర్శులుగా బాల్‌రెడ్డి, రాంరెడ్డి, కోశాధికారిగా గూడ రాజిరెడ్డి, మరో పదిమంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలి


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్‌: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అక్టోబర్‌ 6న ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్‌ పిలుపునిచ్చారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా విద్యార్థులకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. కార్పొరేట్‌ ప్రయివేటు విద్యా వ్యవస్థను పెంచి పోషిస్తున్నారన్నారు. సభకు జిల్లా నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాషువా, సంజయ్‌. రాకేశ్‌, అఖిల్‌, హర్ష, అభినయ, జ్యోతి పాల్గొన్నారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


వెదురు దినోత్సవంలో మేదరులు

బోయినపల్లి: ప్రభుత్వం మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదరి సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో బుధవారం సంఘ నాయకుల ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వెదురు ఉత్పత్తుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెదురు కార్మికులకు మేదరి బంధు పథకం వర్తింపజేయాలని కోరారు. వెదురు మొక్కలు పెంచేందుకు ఐదెకరాల మేర స్థలం, భవన నిర్మాణానికి స్థలం కేటాయించి, యాభై ఏళ్లు నిండిన మేదరులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుల్ల బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ముత్తయ్య మృతదేహం

సిరిసిల్లక్రైం: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లివస్తుండగా బైక్‌ అదుపుతప్పి కిందపడడంతో ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన గొల్లకామటి ముత్తయ్య (48) మృతి చెందాడు. సిరిసిల్లలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ అర్బన్‌ మండలంలోని రుద్రవరం గ్రామంలో తన బంధువులు ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన ముత్తయ్య తిరుగుప్రయాణంలో సిరిసిల్ల బైపాస్‌ మీదుగా బైక్‌ వస్తుండగా రిజిస్ట్రేషన్‌ కార్యాలయ సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఆయనను ఆసుపత్రి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని సోలార్‌ ప్లాంట్‌లో సెక్యూరిటీగా విధులు నిర్వహించే ముత్తయ్యకు భార్య మౌనిక ఇద్దరు కొడుకులున్నట్లు సమాచారం.

లంబోదరునికి ప్రత్యేక పూజలు


వేములవాడ: రాజన్న ఆలయంలో..


సిరిసిల్లటౌన్‌: సుభాష్‌నగర్‌లో..


రుద్రంగిలో..

గణేశ్‌ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండపాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. రుద్రంగిలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ గణేశుని దర్శించుకున్నారు.

– సిరిసిల్లటౌన్‌/వేములవాడ/కోనరావుపేట/రుద్రంగి/వీర్నపల్లి/బోయినపల్లి/గంభీరావుపేట

పీఆర్సీ అమలు చేయండి

- టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు దోర్నాల


మాట్లాడుతున్న రమానాథ్‌ రెడ్డి

చందుర్తి/తంగళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టేందుకు అవసరమైన పీఆర్సీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియమించాలని టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి కోరారు. చందుర్తి మండలం మూడపల్లి, జోగాపూర్‌, సనుగుల, మల్యాల, చందుర్తి, తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్‌ కేజీబీవీ, తంగళ్లపల్లి, తాడూర్‌, బస్వాపూర్‌, నేరెళ్ల, జిల్లెల్ల, చిన్నలింగాపూర్‌ పాఠశాలల్లో టీపీటీఎఫ్‌ ఉపాధ్యాయ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం వేర్వేరుగా నిర్వహించారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత పీఆర్సీ గడువు ఇప్పటికే ముగిసిందన్నారు. నూతన పీఆర్సీని అమల్లోకి తీసుకురావాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు విక్కుర్తి అంజయ్య, చందుర్తి మండల అధ్యక్షులు మహేశ్‌, ప్రధాన కార్యదర్శి తాటికొండ సంజీవ్‌, బొజ్జ కృష్ణ, కృష్ణచైతన్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌, విక్కుర్తి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, సత్తు రవీందర్‌, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు బండి ఉపేందర్‌, ప్రధాన కార్యదర్శి కోడం వెంకటేశం, జిల్లా బాధ్యులు గుండెల్లి రవీందర్‌, పదిరె బాలాగౌడ్‌ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై పోటీలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని హైస్కూల్‌ విద్యార్థులకు బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్‌పై వ్యాసరచన, రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాజసులోచన హెడ్‌మాస్టర్‌ ఎం. ప్రేమలత, తపస్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరుగులరాణికి ఆత్మీయ సన్మానం


రామానుజమ్మను సన్మానిస్తున్న నీరజ దంపతులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన అలుపెరగని పరుగుల రాణి టమటం రామానుజమ్మ(70)ను బుధవారం సిరిసిల్లలో స్థానిక కౌన్సిలర్‌ గుండ్లపల్లి నీరజ, పూర్ణచందర్‌ దంపతులు సన్మానించారు. 35వ ఇంటర్నేషనల్‌ ఓపెన్‌ మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 16, 17, 18 తేదీల్లో జరిగాయి. ఈపోటీల్లో రామానుజమ్మ ఇండియా తరఫున 50 కిలోల విభాగంలో రామానుజమ్మ పాల్గొన్నారు. 200 మీటర్ల పరుగు పందంలో మూడో స్థానం సాధించారు. రజత పథకంతో బుధవారం ఇండియాకు చేరిన రామానుజమ్మను స్థానిక 17వ వార్డు కౌన్సిలర్‌ గుండ్లపల్లి నీరజ, పూర్ణచందర్‌ దంపతులు సన్మానించారు.

ప్రభుత్వ కళాశాలలో ఎన్నికలు



కళాశాల ఆవరణలో ఎన్నికల ప్రక్రియ

సిరిసిల్లకల్చరల్‌: జిల్లా కేంద్రంలోని శివనగర్‌లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ప్రెసిడెంట్‌, హెడ్‌బాయ్‌, హెడ్‌గర్ల్‌ పోస్టుల కోసం బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా సాధారణ ఎన్నికల తరహాలో జరగడం విశేషం. రిటర్నింగ్‌ అధికారి, పోలింగ్‌ అధికారులు, పోలింగ్‌ ఏజెంట్ల పాత్రలను విద్యార్థులు పోషించారు. ఎన్నికల ప్రక్రియను స్థానిక తహసీల్దార్‌ మోయినోద్దిన్‌, ప్రిన్సిపాల్‌ కనకశ్రీ విజయరఘునందన్‌ పర్యవేక్షించారు. పోలింగ్‌ అనంతరం ప్రెసిడెంట్‌గా వినయ్‌, హెడ్‌ గర్ల్‌గా అశ్విని, హెడ్‌ బాయ్‌గా విక్రమ్‌ ఎన్నికైనట్లు ప్రకటించారు.

సమస్యలు పరిష్కరించని సభలెందుకు..?

- సర్పంచులకు సంబంధం లేకుండానే జీసీ బంధు మంజూరు
- అధికారుల తీరుపై మండిపడ్డ మండల సభ


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రయ్య

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు సమస్యలు చెప్పుకోవడం వరకే గానీ పరిష్కారానికి నోచుకోవడంలేదని సర్పంచులు మండిపడ్డారు. కోనరావుపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్‌ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సభలో పలువురు సభ్యులు సమస్యపై అధికారులను నిలదీశారు.

➡ పాఠశాల సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గొల్లపల్లి(వట్టిమల్ల) సర్పంచ్‌ గోవు పర్శయ్య అన్నారు.

➡ బస్సులు రాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని కొండాపూర్‌ సర్పంచ్‌ మల్యాల దేవయ్య అన్నారు.

➡ కంటి వెలుగు నిర్వహణ ఖర్చులు ఇవ్వలేదని రామన్నపేట సర్పంచ్‌ కాదాస్‌ సంతోష్‌ సభ దృష్టికి తెచ్చారు.

➡ పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చాలని ఐదేళ్ల నుంచి కోరుతున్నా ఇప్పటి వరకు మార్చలేదని మల్కపేట సర్పంచ్‌ ఆరె లత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కోరుతున్నానని, పదవీకాలం దగ్గర పడుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

➡ గాలిదుమారంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని మర్తనపేట సర్పంచ్‌ వెన్నమనేని వంశీకృష్ణరావు ఆరోపించారు.

సమస్యలు సమన్వయంతో పరిష్కరించుకోవాలి


ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ చంద్రయ్యగౌడ్‌ అన్నారు. మండల సభలో మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, సెస్‌ వైస్‌ చైర్మన్‌ దేవరకొండ తిరుపతి, వైస్‌ ఎంపీపీ వంగపెల్లి సుమలత, అధికారులు పాల్గొన్నారు.

రుద్రంగిలో సాదాసీదాగా..


మాట్లాడుతున్న ఎంపీపీ గంగం స్వరూపారాణి

రుద్రంగి: ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు మూడు నెలల ప్రగతి ప్రణాళికను చదివి వినిపించారు. మూడు నెలలకు ఒకసారి ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఒక్క గ్రామ సర్పంచ్‌ కూడా రాక పోవడం బాధకరమని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీలత, ఎంపీడీవో మాలోతు శంకర్‌, మిషన్‌ భగీరథ డీఈ శ్రీనివాస్‌, సెస్‌ డైరెక్టర్‌ గంగారాం, వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, కోఆప్షన్‌ మెంబర్‌ జెమీలా బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల స్వీయ రక్షణకు మార్షల్‌ ఆర్ట్స్‌


బాలికలకు శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్‌ బాలరాజు

ముస్తాబాద్‌: బాలికల స్వీయ రక్షణకు మార్షల్‌ ఆర్ట్స్‌ ఎంతగానో ఉపయోగపడుతాయని ముస్తాబాద్‌ ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌ కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఆపరేషన్‌ జ్వాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు కరాటేలో శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పది రోజుల పాటు బాలికలకు తమను తాము రక్షించుకునేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆకతాయిల బారిన పడకుండా స్వయంగా రక్షించుకునే టెక్నిక్స్‌ను నేర్పించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాలికలకు మార్షల్స్‌ ఆర్ట్స్‌ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ ఆపద వచ్చిన 100 ఫోన్‌ చేయాలని కోరారు. ప్రత్యేకాధికారి శ్రీలత, ఇన్‌స్ట్రక్టర్‌ బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డుపై కిష్కింధకాండ

గంభీరావుపేట: మండల కేంద్రంలో కోతుల కిష్కింధకాండతో అరగంట సేపు వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ప్రజలు భయాందోళనతో ఇళ్లు, దుకాణాల తలుపులు మూసేశారు. తర్వాత కొంత మంది యువకులు కర్రలతో వాటిని చెదరగొట్టారు.

భవన నిర్మాణం పనులు పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ సముదాయాన్ని ఎంపీపీ వెంకటరమణారెడ్డి, పీఆర్‌ డీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ అజారుద్దిన్‌ బుధవారం పరిశీలించారు.

కవ్వంపల్లిపై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

ఇల్లంతకుంట: మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు పసుల వెంకటి స్థానిక విలేకరుల సమావేశంలో అన్నారు.

కళలను బతికించుకుందాం

ముస్తాబాద్‌: అంతరించిపోతున్న తెలంగాణ కళలను బతికించుకోవాలని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మండలంలోని మోహినికుంటలో బుడగ జంగాల బుర్రకథను చెప్పించి, కళాకారులను సత్కరించారు.

వైద్య శిబిరం

గంభీరావుపేట: మండలం ముచ్చర్ల గ్రామంలో బుధవారం లింగన్నపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు.

పొట్టి తాటి విత్తనాలు లాభదాయకం

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో పొట్టి తాటి విత్తనాలను వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్‌ గౌడ కులస్తులతో కలిసి నాటారు. ఈ చెట్లు 5 నుంచి ఏడేళ్లలోనే కల్లు ఇస్తాయన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ముస్తాబాద్‌: తెలుగు వెలుగు సాహితీ వేదిక ద్వారా జాతీయ పురస్కారాలు అందుకున్న ఎల్లారెడ్డిపేటకు చెందిన ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, దుంపెన రమేశ్‌ను బుధవారం పలువురు సన్మానించారు.

మార్కెట్‌ కమిటీ పాలకవర్గానికి..

వీర్నపల్లి: మండల కేంద్రం, అడవిపదిర గ్రామంలో ఏఎంసీ చైర్మన్‌ గుజ్జుల రాజిరెడ్డి, సెస్‌ డైరెక్టర్‌ మాడుగుల మల్లేశం, ఏఎంసీ డైరెక్టర్లను వీర్నపల్లి ఆర్యవైశ్య సంఘం, అడవిపదిర సర్పంచ్‌ ఎడ్ల లక్ష్మీరాజం సన్మానించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్‌

కోనరావుపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 28 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయంలో సమ్మె నోటీస్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ జీవో నెం.8 ప్రకారం కార్మికులకు పెంచిన వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్‌ బిల్లులను విడుదల చేయాలన్నారు. పాఠశాలలో వంట షెడ్లు నిర్మించి, వంట పాత్రలను అందించాలని ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు.